

భ్రామరికి ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన భ్రమరాంబాదేవికి బుధవారం మూలనక్షత్రం సందర్భంగా అర్చకులు, వేదపండితులు ఊయలసేవను నిర్వహించారు.



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు బుధవారం అర్చకులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



బ్రహ్మోత్సవాలకు వేళాయె

శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఏర్పాట్లలో దేవస్థానం అధికారులు నిమగ్నమయ్యారు.

8లో▸

న్యూస్‌రీల్

గర్భిణులూ.. ఫ్లోరైడ్ నీటిని తాగొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు ఎట్టి పరిస్థితుల్లో ఫ్లోరైడ్ అధికంగా ఉన్న నీటిని తాగొద్దని, అలా తాగితే మరుగుజ్జు బిడ్డలు పుట్టే అవకాశం ఉంటుందని ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం కర్నూలులోని ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ప్రభుత్వ వైద్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భధారణ సమయంలో ఫ్లోరైడ్ అధికంగా ఉన్న నీటిని తాగితే పేగు గోడలు దెబ్బతిని శరీరం ఐరన్‌ను శోషించుకోదని, గర్భస్రావం అయ్యే అవకాశం ఉందన్నారు. ఫ్లోరోసిస్ ఉన్న ప్రాంతాల్లో గర్భిణులు కాల్షియం, ఐరన్, విటమిన్-సి, జింక్ కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. డీఐవో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, గైనకాలజిస్టులు డాక్టర్ శ్రావణి, డాక్టర్ సంధ్య, డాక్టర్ రత్నకుమారి, ఆర్మాన్ సంస్థ ప్రతినిధి డాక్టర్ కావ్య, డెమో ప్రమీలమ్మ, డీపీహెచ్ఎన్‌వో ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా 'అసైన్డ్' రికార్డుల పరిశీలన

కర్నూలు(సెంట్రల్): ఫ్రీ హోల్డ్ అసైన్డ్ భూముల రికార్డుల పరిశీలనను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఇన్‌చార్జ్ భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ ఆదేశించారు. బుధవారం విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసైన్‌మెంట్ భూములు తీసుకొని 20 ఏళ్ల అనుభవంలో ఉన్న వారికి సంపూర్ణ హక్కులు ఇచ్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని పురోగతిని జేసీ నారపురెడ్డి మౌర్య వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

విధుల్లో చేరుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ అభ్యర్థన మేరకు సమ్మెను విరమించి అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు విధుల్లోకి చేరుతున్నారు. ఈ నెల 9వ తేది వరకు 220 మంది విధుల్లో చేరగా, 10వ తేదీన జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 82 మంది వర్కర్లు, 83 మంది హెల్పర్లు విధుల్లోకి చేరినట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 385 మంది వర్కర్లు, హెల్పర్లు విధుల్లో చేరారని, విధుల్లోకి చేరని వారందరికీ వెంటనే చేరాలని నోటీసులను రిజిష్టర్ పోస్టు ద్వారా పంపామన్నారు.

నలుగురు సీఐలకు స్థానచలనం

- వీఆర్‌లో ఉన్న ముగ్గురికి పోస్టింగ్‌లు

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలో నలుగురు సీఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా వీఆర్‌లో ఉన్న ముగ్గురు సీఐలకు పోస్టింగులు దక్కాయి. కర్నూలు డీటీఆర్‌బీ సీఐ పి.శివశంకర్ కర్నూలు సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. అలాగే వీఆర్‌లో ఉన్న ఎ.ఆదినారాయణరెడ్డిని డీటీఆర్‌బీకి, ఎస్.హనుమంతప్పను ఆస్పరి యూపీఎస్‌కు, కుంచల శ్రీనివాసులును దేవనకొండ యూపీఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో దేవనకొండ, ఆస్పరి పోలీస్‌స్టేషన్లకు ఎస్‌హెచ్‌ఓలుగా ఎస్ఐలు ఉండేవారు. అయితే ఆయా స్టేషన్లు అప్‌గ్రేడ్ కావడంతో అక్కడ సీఐలు నియమితులయ్యారు. ఇకపై ఆయా స్టేషన్లు సీఐల పర్యవేక్షణలో కొనసాగనున్నాయి.

మల్లన్న హుండీ ఆదాయం రూ.4.83 కోట్లు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉభయ దేవాలయాల హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు మాట్లాడుతూ ఆలయ హుండీల ద్వారా రూ.4,83,53,238 లభించినట్లు తెలిపారు. అలాగే 133 గ్రాముల 300 మిల్లీగ్రాముల బంగారం, 11 కేజీల 859 గ్రాముల వెండితో పాటు కొంత విదేశీ కరెన్సీ కూడా లెక్కింపులో లభించాయన్నారు. లెక్కింపులో దేవస్థానం అన్ని శాఖల ఉద్యోగులు, అధికారులు, శివసేవకులు పాల్గొన్నారు.

2014 ఎన్నికల సమయంలో..

చంద్రబాబు ఏం చెప్పాడంటే..

- రైతులు, పొదుపు మహిళలు ఎవ్వరూ రుణాలు(డ్వాక్రా రుణాలు) చెల్లించొద్దు. నేను సీఎం సీటులో కూర్చున్న తర్వాత రుణాలన్నింటినీ మాఫీ చేస్తా. రైతులకు బంగారంపై తీసుకున్న రుణాలనూ మాఫీ చేస్తా.
- జాబు రావాలంటే బాబు రావాలి. ఉద్యోగం ఇవ్వలేకపోతే నెలకు రూ.2వేల నిరుద్యోగ భృతి ఇస్తా. ఇలా ఎన్నో..

అధికారంలోకి వచ్చాక ఏం చేశాడంటే..

- రుణమాఫీ హామీకి తూట్లు పొడిచి రైతులను మరింత అప్పుల ఊబిలోకి నెట్టాడు.
- పొదుపు మహిళల డ్వాక్రా రుణ మాఫీని పక్కన పెట్టి పెట్టుబడి నిధి పేరిట కొత్త నాటకం.
- 2019 ఎన్నికలకు ముందు పొదుపు మహిళలకు పసుపు, కుంకుమ పేరుతో ఓట్లు దండుకొనే ప్రయత్నం.
- ఉద్యోగాల మాట దేవుడెరుగు, కనీసం నిరుద్యోగ భృతికీ సున్నా చుట్టేశాడు.

2024 ఎన్నికల వేళ..

మళ్లీ అదే ధోరణి. అది చేస్తా, ఇది చేస్తా. అధికారంలో ఉండగా ఎందుకు చేయలేకపోయాడనేది మాత్రం చెప్పడు.



చంద్రబాబు హామీలను విశ్వసించం



- ఎ.లక్ష్మణస్వామి, రైతు, ముక్కెళ్ల, తుగ్గలి మండలం

చంద్రబాబు పాలనను చూశాం. ఎన్నికల ముందు అధికారం కోసం ఎన్ని హామీలు ఇవ్వాలో అన్నీ ఇస్తారు. ఆ తర్వాత వాటిని పక్కన పెట్టేస్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక అందరికీ న్యాయం జరుగుతోంది. మాకు 9 ఎకరాల భూమి ఉంది. వైఎస్ఆర్ రైతుభరోసా, అమ్మఒడి, ఉచిత పంటల బీమాతో సంతోషంగా ఉన్నాం. ఆర్‌బీకేలు, సచివాలయాలతో అన్ని రకాల సేవలు ఊళ్లోనే అందుతున్నాయి. ఇంతకన్నా ఏం కావాలి.

జగన్ చెప్పాడంటే చేసి తీరుతారు



- నారాయణరెడ్డి, రేమడూరు, కల్లూరు మండలం

2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంపూర్ణంగా అమలు చేశారని నమ్ముతున్నాం. దళారీల ప్రమేయం లేకుండా, లంచాలకు తావు లేకుండా సంక్షేమ కార్యక్రమాలు మా ఇంటి తలుపు తట్టాయి. అదే 2014 నుంచి 2018 మధ్య చంద్రబాబు పాలనలో ఏది కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఎన్నికలు వచ్చినప్పుడే చంద్రబాబుకు ప్రజల మీద ప్రేమ పుట్టుకొస్తుంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమ రాజ్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతోంది. పేదరిక నిర్మూలన లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తోంది. అన్నదాతల కోసం ప్రతి ఏటా రైతుల పెట్టుబడి కష్టాలను తీర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ రైతుభరోసాను అమలు చేస్తోంది. ప్రతి ఏటా అంటే 2019-20 నుంచి 2023-24 వరకు ఐదేళ్లు విజయవంతంగా అమలు చేయడం విశేషం. ఐదేళ్లలో ఒక్క వైఎస్ఆర్ రైతుభరోసా కిందనే అన్నదాతలకు రూ.1,793.53 కోట్లు రైతులకు పెట్టుబడి సాయంగా అందింది.



నాడు నయవంచన.. నేడు నవచరిత!

కర్నూలు(అగ్రికల్చర్): మరో మూడు నెలల్లో ఎన్నికలు. మళ్లీ కొత్త హామీలతో చంద్రబాబు ఊరూరా తిరగడం మొదలైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం కంటే మూడు రెట్లు అధికంగా ఇస్తానని ప్రజల చెవుల్లో పూలు పెట్టేందుకు సిద్ధమయ్యారు టీడీపీ నేతలు. 2014-15 నుంచి 2018-19 వరకు చంద్రన్న వాతలు ఇప్పటికీ పచ్చిగానే ఉన్నాయి. ఎలాగైనా అధికారంలోకి రావాలనే తలంపుతో తప్పుడు హామీలు గుప్పిస్తూ ప్రజలను వంచించే ప్రయత్నం మళ్లీ మొదలైంది. 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చి నవ శకానికి నాంది పలికారు. దళారీల ప్రమేయం లేకుండా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను చేరుస్తూ ప్రశంసలు పొందుతున్న ప్రభుత్వమిది.

- 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి ఉమ్మడి జిల్లాలో బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు 5.25 లక్షల మంది. వీరు తీసుకున్న రుణాల మొత్తం రూ.2,750 కోట్లు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఈ మొత్తం మాఫీ కావాల్సి ఉంది.
- చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టాక రైతుల వ్యవసాయ రుణాల మాఫీలో అనేక షరతులు విధించారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అంటూ మెలికపెట్టి కుటుంబానికి గరిష్టంగా రూ.1.50 లక్షల వరకే మాఫీ అంటూ ప్రకటించారు. ఇందువల్ల వేలాది మందికి తూతూ మంత్రంగా మాఫీ లభించింది. అది వ్యవసాయ రుణాల మాఫీ కాదు.. కేవలం ఉపశమనం మాత్రమే.
- జిల్లాలో 5.25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉంది. అయితే 4,30,830 మందికి మాత్రమే మాఫీ ఉపశమనం లభించింది. అంటే 94,170 మంది రైతులకు రుణ మాఫీ ఎగ్గొట్టేశారు. రూ.2,750 కోట్లలో రూ.1,693.44 కోట్లు మాత్రమే మాఫీ చేస్తున్నట్లు ప్రకటించి చివరికి రూ.1,429 కోట్లతో సరిపుచ్చారు.
- 94,170 మంది రైతులకు రూ.1,057 కోట్ల రుణాలు మాఫీ కాకపోవడంతో ప్రతి రైతుపై సగటున వడ్డీ, అపరాధ రుసుము భారం రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు వడ్డీ భారం పడింది. ఈ మొత్తం భారం రూ.161 కోట్లు.

హామీలతో చంద్రబాబు దగా

- అరకొర రుణమాఫీతో రైతులపై వడ్డీ భారం
- డ్వాక్రా రుణాల మాఫీ పేరిట మోసం
- ఊసేలేని నిరుద్యోగ భృతి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ సంక్షేమం
- వైఎస్ఆర్ రైతు భరోసాతో అన్నదాతకు చేయూత
- పలు పథకాలతో మహిళలకు ఊరట
- యువతకు ఉద్యోగాల కల్పనతో భరోసా

అప్పుల ఊబిలో మహిళలు

2014 నాటికి జిల్లాలో చంద్రబాబు ఇచ్చిన హామీల ప్రకారం 43,960 డ్వాక్రా సంఘాలకు రూ.769 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. అయితే మాట మార్చడం వల్ల మహిళలు ఇప్పటికీ వడ్డీలు కట్టలేని పరిస్థితి ఏర్పడింది. మాఫీ హామీని పక్కన పెట్టి కేవలం పెట్టుబడి నిధి కింద సంఘానికి రూ.లక్ష ఇస్తామని ప్రకటించారు. ఇది కూడా ఆచరణలో తూతూ మంత్రంగానే సాగింది.



వైఎస్ఆర్ రైతు భరోసా మెగా చెక్‌ను విడుదల చేస్తున్న దృశ్యం (ఫైల్)

పింఛన్లను అడ్డంగా కోసేశారు..

తెలుగుదేశం ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, చేనేత కారులకు ఇచ్చే పింఛన్లను రూ.200 నుంచి రూ.1000లకు పెంచినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే వేలాది పింఛన్లను అడ్డంగా కోసేశారు.

- 2013-14లో మొత్తం పింఛన్లు 3,32,017. 2014-15లో పింఛన్ల సంఖ్య 3,02,481 తగ్గిపోయింది. అధికారం చేపట్టిన వెంటనే 30వేల పింఛన్లకు కోతపెట్టారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా కొత్తగా మంజూరు చేసిన పింఛన్లు 28,725 మాత్రమే. ఇవి కూడా జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకున్న వారికే లభించడం గమనార్హం.

వైఎస్ఆర్ ఉచిత పంటల బీమాతో రైతులకు ఊరట

వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతులకు వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా సదుపాయం కల్పించడం పెద్ద ఊరటనిస్తోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో బీమా మొత్తానికి 2 నుంచి 5 శాతం ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తించేది. వేలాది రూపాయల ప్రీమియం చెల్లించినప్పటికీ పరిహారం తూతూ మంత్రంగా వచ్చేది. నేడు ప్రభుత్వం వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా సదుపాయాన్ని కల్పించడం విశేషం. నోటిపై చేసిన పంటలు ఈ-క్రాప్‌లో నమోదైతే చాలు బీమా ఉన్నట్లే. 2019-20 నుంచి ఖరీఫ్‌లో రైతులు ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకపోయినా ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా రైతులకు దాదాపు రూ.618.91 కోట్ల ప్రయోజనం కల్పించింది. టీడీపీ హయాంలో ప్రతి ఏటా కరువు వచ్చినా ఐదేళ్లలో అందించిన పరిహారం అంతంతమాత్రమే.

మహిళలకు రూ.2,500 కోట్ల లబ్ధి

వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల వల్ల మహిళల జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి. వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ సున్నా వడ్డీ రుణాలు, జగనన్న తోడు కింద ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు రూ.1,890.19 కోట్లు మహిళలకు అందించారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో మహిళలకు దాదాపు మరో రూ.695 కోట్ల వరకు ప్రయోజనం లభించనుంది. నాడు చంద్రబాబు కేవలం రూ.769 కోట్లు మాఫీ చేయలేక చేతులెత్తేస్తే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.2,500 కోట్ల వరకు ప్రయోజనం కల్పించారు.

- జాబు రావాలంటే బాబు రాలంటూ 2014 ఎన్నికల సమయంలో చేసిన హడావుడి అంతా, ఇంతా కాదు. చంద్రబాబు పాలన ఐదేళ్లలో రాష్ట్రం మొత్తం మీద ఇచ్చిన ఉద్యోగాలు 31వేలు మాత్రమే. వైఎస్ఆర్‌సీపీ పాలనలో 2.34 లక్షలు ఉద్యోగాలు ఇచ్చారు. ఉద్యోగం ఇవ్వలేకపోతే నెలకు రూ.2వేల నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ప్రకటించిన చంద్రబాబు ఎన్నికలకు మూడు, నాలుగు నెలల ముందు టీడీపీ కార్యకర్తలకు నిరుద్యోగభృతి అంటూ రూ.1000 ప్రకారం ఇచ్చారు. నాడు చంద్రబాబు ఇచ్చిన హామీల్లో 18 శాతం మాత్రమే అమలు చేయగా.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 98 శాతం అమలు చేశారు.

అడుగడుగునా అభివృద్ధి

ఆర్ఐడీఎఫ్ నిధులు, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేపట్టింది. మొత్తం 388 ప్రాజెక్టులకు రూ.969.02 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ప్రభుత్వం తీసుకున్న చొరవతో మెడికల్ కాలేజీలు, ఏరియా హాస్పిటల్స్ ఏర్పాటయ్యాయి. అగ్రీల్యాబ్‌లు, గ్రామాల వారీగా రైతుభరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లు, సీసీ రోడ్లు, పాఠశాలలు, హాస్పిటల్స్‌కు కాంపౌండు వాల్స్ ఇలా అనేకం నిర్మించారు. ఇలా అనేక అభివృద్ధి పనులు ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయి.

చిరు వ్యాపారులకు భరోసా

- నేడు 8వ విడత 'జగనన్న తోడు' విడుదల
- 14,586 మందికి వడ్డీ రాయితీ లబ్ధి
- ఇప్పటి వరకు రూ.140.41 కోట్ల రుణ సదుపాయం

కర్నూలు(అగ్రికల్చర్): చిరు వ్యాపారుల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న తోడు పథకాన్ని అమలు చేస్తోంది. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తూ సక్రమంగా చెల్లించే వారికి వడ్డీ రీయింబర్స్‌మెంట్ చేస్తోంది. ఇప్పటి వరకు ఏడు దఫాలుగా ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇచ్చింది. గురువారం 8వ విడత వడ్డీ రాయితీ విడుదల చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బటన్ నొక్కి ప్రారంభించనున్నారు. కర్నూలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ప్రజాప్రతినిధులు, డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ సలీమ్‌బాషా, మున్సిపల్ కమిషనర్లు పాల్గొననున్నారు. ఎనిమిదో విడతలో జిల్లాలో 14,586 మంది చిరు వ్యాపారాలకు రూ.29,92,035 వడ్డీ రీయింబర్స్‌మెంటు కానుంది. గ్రామీణ ప్రాంతాల్లో 9,581 మందికి, అర్బన్ ప్రాంతాల్లో 5,005 మందికి లబ్ధి చేకూరనుంది.

8వ విడతలో రూ.20.78 కోట్ల రుణాలు

జగనన్న తోడు పథకం కింద గడచిన ఆరు నెలల్లో చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా పెద్ద ఎత్తున రుణాలు ఇచ్చారు. డీఆర్‌డీఏ-వైకేపీ, మెప్మా అధికారులు, సిబ్బంది బ్యాంకులతో సమన్వయం చేసుకున్నారు. జగనన్న తోడు కింద 8వ విడతలో జిల్లాలో 19,645 మందికి రూ.20.78 కోట్ల రుణాలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో 11,999 మందికి రూ.12.69 కోట్లు, పట్టణ ప్రాంతాల్లోని వారికి రూ.8.09 కోట్లు రుణాలు ఇచ్చారు. ఇప్పటి వరకు మొత్తం ఎనిమిది విడతల్లో చిరువ్యాపారులకు రూ.140.41 కోట్ల రుణ సదుపాయం కల్పించారు. మొత్తంగా 1,03,894 మందికి రూ.2.53 కోట్ల వడ్డీ వెనక్కి చెల్లించారు.



వస్త్ర వ్యాపారం చేస్తున్న మహిళ

వ్యాపార అభివృద్ధికి మేలు



గతంలో చిరు వ్యాపారులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు డబ్బు తీసుకొని ఇబ్బందులు పడేవారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ప్రస్తుతం బ్యాంకుల ద్వారా రుణం పొందుతున్నారు. వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటున్నారు. 8వ విడత జగనన్న తోడు కింద జిల్లాలోని 14,586 మంది చిరు వ్యాపారులకు రూ.29,92,035 వడ్డీ రాయితీ రానుంది.

- ఎస్.సలీమ్‌బాషా, డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ

కూరగాయల వ్యాపారంలో రాణిస్తున్నా



నేను శివ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలుగా ఉన్నా. జగనన్న తోడు కింద మొదటిసారిగా రూ.10 వేలు రుణం తీసుకున్నా. ఈ డబ్బుతో కూరగాయల వ్యాపారంలో రాణిస్తున్నా. రోజుకు అన్ని ఖర్చులు పోగా రూ.500 వరకు మిగులుతోంది. చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు' అండగా నిలుస్తోంది.

- కే.మాధవి, పెద్దపాడు, కల్లూరు మండలం

బీసీల పార్టీ వైఎస్సార్‌సీపీ

- డాక్టర్ సంజీవ్‌కుమార్ వ్యాఖ్యలు అర్థరహితం
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య



కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ బీసీల పార్టీ అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య పేర్కొన్నారు. కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ సంజీవ్‌కుమార్ బీసీ కావడంతో రాజకీయ అనుభవం లేకున్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కర్నూలు ఎంపీ సీటు ఇచ్చి గెలిపించారన్నారు. చేసిన మేలును మరచి ముఖ్యమంత్రిని విమర్శించడం తగదన్నారు. నాలుగు రోజుల క్రితం కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో జరిగిన సామాజిక సాధికార యాత్రలో సంజీవ్‌కుమార్ ఏం మాట్లాడారో ఒకసారి గుర్తు తెచ్చుకోవాలని సూచించారు. బీసీలకు న్యాయం చేసింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని, ఎస్సీ, ఎస్టీలు, బీసీ వర్గాల ప్రజలు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందారంటే అందుకు ముఖ్యమంత్రే కారణమని పొగిడిన విషయం గుర్తులేదా అన్నారు. సామాజిక సమీకరణాల్లో భాగంగా మార్పులు చేర్పులు ఉంటాయని, ఇప్పుడు ప్రకటించిన కర్నూలు ఎంపీ అభ్యర్థి కూడా బీసీ వర్గానికి చెందిన వ్యక్తే కదా అని ప్రశ్నించారు. ఆవేశంతో మాట్లాడటం తగదన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డబ్ల్యూహెచ్‌ఓ వైద్యులు



రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురం పీహెచ్‌సీని డబ్ల్యూహెచ్‌ఓ వైద్యులు సందేశ్ బుధవారం సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఓపీ వివరాలు, మందులు, పీహెచ్‌సీలోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కాసేపు రోగులతో మాట్లాడారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యులు బాబు, ఎన్‌క్యూయూఏఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారులు లక్ష్మన్, నాగేంద్ర ఉన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ ఐదు, ఒకటో సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం చూచిరాతలకు పాల్పడిన ఆరుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా ఉదయం సెషన్‌లో జరిగిన ఐదవ సెమిస్టర్ పరీక్షకు 5,778 మందికి గాను 5, 313 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్షకు 5,941 మందికి గాను 5, 368 మంది హాజరయ్యారని తెలిపారు. చూచిరాతలకు పాల్పడుతూ ఆలూరు శ్రీ రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ఎమ్మిగనూరు రావూస్ డిగ్రీ కళాశాల, పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విజయ సాయి డిగ్రీ కళాశాల, ఎమ్మిగనూరు సిద్దార్థ డిగ్రీ కళాశాలలో ఒక్కరు చొప్పున ఆరుగురు విద్యార్థులను డిబార్ చేశామన్నారు.

క్లుప్తంగా

మార్చి 5లోపు 'ఈ-క్రాప్' తుదిజాబితా

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసి, తుది జాబితాను మార్చి 5లోపు ప్రకటించాలని వ్యవసాయ యంత్రాంగాన్ని ఆ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారు. బుధవారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. రబీలో 100 శాతం ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన ఈ-క్రాప్‌లో ప్రత్యేకంగా నమోదు చేయాలన్నారు. పీఎం కిసాన్ కింద ఆర్థిక సహాయం పొందేందుకు ఈ-కేవైసీతో పాటు బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయించాలన్నారు. 2024-25 ఖరీఫ్ సీజన్ నుంచి రైతులకు డ్రోన్ సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్‌వరలక్ష్మి, ఏడీఏలు సాలురెడ్డి, బాలవర్ధిరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపరచండి

- సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పీపీ వవ



మాట్లాడుతున్న సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పీపీ వవ

నంద్యాల: సఫాయి కర్మచారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పీపీ వవ జిల్లా అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, జాతీయ సఫాయి కర్మచారుల కమిషన్ మెంబర్ అడ్వైజర్ గిరింధర్, మెంబర్ కోఆర్డినేటర్ సందీప్ చరణ్, డీఆర్‌ఓ పుల్లయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు, కార్మికశాఖ తదితర అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సఫాయి కర్మచారులకు కనీస వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు వారి దరికి చేర్చాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సఫాయి కర్మచారులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహాలు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. సఫాయి కర్మచారులకు పే స్లిప్, పీఎఫ్, ఆరోగ్యశ్రీ, బీమా తదితర సౌకర్యాలు అందిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్లు, కార్మిక శాఖ అధికారులు కమిషన్ సభ్యులకు నివేదించారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, సఫాయి కర్మచారుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కర్నూలు: నగర శివారులోని వెంగన్నబావి సమీపంలో 44వ నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సవారమ్మ (65) మృతిచెందారు. ఈమె భర్త రెండేళ్ల క్రితం మృతిచెందారు. ఈమెకు ఏడుగురు కూతుర్లు, ముగ్గురు కొడుకులు సంతానం. బుధవారం ఉదయం కర్నూలుకు వచ్చేందుకు వెంగన్నబావి సమీపంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. ఆమె చికిత్స పొందుతూ కోలుకోలేక సాయంత్రం మృతిచెందింది. కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె

- 12 నుంచి శ్రీశైలంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు
- 7రోజులు పాటు జరగనున్న ఉత్సవాలు
- ప్రతి రోజు స్వామిఅమ్మవార్లకు విశేషంగా వాహన సేవ
- 15న మకర సంక్రాంతి రోజున స్వామి అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం



శ్రీశైలాలయం

శ్రీశైలంటెంపుల్: మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు శ్రీశైల క్షేత్రం ముస్తాబైంది. మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని శ్రీశైలమహాక్షేత్రంలో ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. పాంచాహ్నిక దీక్షతో 7 రోజుల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాలు ఈనెల 18తో ముగియనున్నాయి. ఏర్పాట్లలో దేవస్థానం అధికారులు నిమగ్నమయ్యారు.

బ్రహ్మోత్సవ కార్యక్రమం..

సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఈ నెల 12న ఉదయం 8.30 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశంతో ప్రారంభమవుతాయి. వేదపండితులు చతుర్వేద పఠనం, లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు బ్రహ్మోత్సవ సంకల్పాన్ని పఠిస్తారు. గణపతి పూజ, స్వస్తి పుణ్యహవాచనం జరిపిస్తారు. చండీశ్వరునికి విశేషంగా పూజలు జరిపించి, కంకణ ధారణ, రుత్విగ్వరణం, అఖండ దీపారాధన, వాస్తు పూజ, వాస్తు హోమం, మండతాపారాధనలు, కలశ స్థాపన, పంచవరణార్చనలు, జపానుష్టాలు, పారాయణలు నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి అంకురారోపణ, అగ్నిప్రతిష్టాపన, ధ్వజారోహణ, ధ్వజపటావిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు, మండపారాధనలు పంచవరణార్చనలు, రుద్రహోమం, చండీహోమం, నిత్యహవనాలు ఉంటాయి. రెండవ రోజు 13వ తేదీ నుంచి స్వామిఅమ్మవార్లకు విశేషంగా వాహన సేవలు జరిపిస్తారు. 15న మకర సంక్రాంతిని పురస్కరించుకుని బ్రహ్మోత్సవ కల్యాణం జరిపిస్తారు. 17న ఉదయం యాగపూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, సాయంత్రం సదస్యం, నాగవల్లి, ధ్వజావరోహణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరి రోజు 18వ తేదీన పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవ క్రతువులు ముగుస్తాయి.

ఆర్జిత సేవల నిలుపుదల

సంక్రాంతి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు ఆర్జిత, ప్రత్యక్ష, పరోక్ష సేవలైన రుద్రహోమం, చండీహోమం, మృత్యుంజయహోమం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, స్వామిఅమ్మవార్ల కల్యాణం, ఏకాంత సేవలు నిలిపేయనున్నారు.

తేదీ	వాహన సేవ
12.01.24	ధ్వజారోహణ
13.01.24	భృంగివాహన సేవ
14.01.24	రావణవాహనసేవ
15.01.24	నందివాహనసేవ, బ్రహ్మోత్సవ కల్యాణం
16.01.24	కైలాసవాహన సేవ
17.01.24	పూర్ణాహుతి, త్రిశూలస్నానం, సదస్యం, నాగవల్లి, ధ్వజావరోహణ
18.01.24	అశ్వవాహనసేవ, పుష్పోత్సవం, శయనోత్సవం

సామూహిక భోగి పండ్లు

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 14న (భోగి రోజున) ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో భోగి పండ్ల కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భోగిపండ్లు వేయించుకోదలచిన వారు 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దేవస్థానం పరిపాలనా కార్యాలయంలో ప్రజాసంబంధాల విభాగంలో పేర్లను నమోదు చేసుకోవాలి.

ముగ్గుల పోటీ

మహిళలకు దేవస్థానం ప్రత్యేకంగా ముగ్గుల పోటీలను నిర్వహించనుంది. సంక్రాంతి రోజున ఉదయం 8 గంటలకు ఆలయ దక్షిణమాడవీధిలో ఈ ముగ్గుల పోటీలు నిర్వహించబడతాయి.

బంగారు గొలుసు అప్పగింత



గొలుసును బాధితులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ, ఏఈఓలు

మహానంది: రంగారెడ్డి జిల్లాకు చెందిన భిక్షపతి అనే భక్తుడు 3 తులాల బంగారు గొలుసును గర్భాలయం వద్ద శనివారం పోగొట్టుకున్నాడు. ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి దేవస్థానంలోని సీసీ ఫుటేజీని పరిశీలించారు. గొలుసును తీసుకున్న వారి కారు నంబర్‌ను గుర్తించి మహానంది ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం గొలుసును తెప్పించి పోగొట్టుకున్న వారికి అప్పగించారు. గొలుసు పోయిన 3 రోజుల్లోనే తిరిగి ఇవ్వడంతో భక్తుడు భిక్షపతి దంపతులు ఈఓ, ఎస్‌ఐ, ఆలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ వై.మధు, వేదపండితులు రవిశంకర అవధాని పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడి ఆత్మహత్య

నంద్యాలటౌన్: రైలు కింద పడి పట్టణానికి చెందిన మునిసిపల్ కార్మికుడు హరికృష్ణ(39)ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ జలీల్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని నూనెపల్లె ప్రాంతానికి చెందిన హరికృష్ణ భార్య కొంత కాలం క్రితం మృతి చెందింది. ఇతనికి ఇద్దరు పిల్లలు సంతానం. భార్య మృతిచెందినప్పటి నుంచి మానసికంగా కృంగుబాటుకు గురయ్యాడు.ఈక్రమంలో నందిపల్లె-సీతారామపురం రైల్వే ట్రాక్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మార్కెటింగ్ శాఖలో ఆరుగురికి పదోన్నతులు

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెటింగ్ శాఖలో ఆరుగురికి పదోన్నతులు లభించాయి. నలుగురికి గ్రేడ్-3 సెక్రటరీ నుంచి గ్రేడ్-2 సెక్రటరీలు గా, ఇద్దరికి అసిస్టెంటు సెక్రటరీ నుంచి గ్రేడ్-3 సెక్రటరీలుగా పదోన్నతి లభించింది. బుధవా రం గుంటూరులోని మార్కెటింగ్ శాఖ కమిషనరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి వీరికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఎమ్మిగనూరులో గ్రేడ్-3 సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న మాధవకృష్ణారెడ్డిని డోన్‌కు, అనంతపురం జిల్లా రాయదుర్గంలో ఉన్న సునీతను ఆలూరుకు,కోడుమూరులో ఉన్న సుబ్బారెడ్డిని ఆత్మకూరుకు, సూళ్లూరుపేటలో ఉన్న కృష్ణమోహన్‌రెడ్డిని కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పదోన్నతిపై గ్రేడ్-2 సెక్రటరీలుగా నియమించారు. నందికొట్కూరులో అసిస్టెంటు సెక్రటరీగా ఉన్న ఎం.శ్రీనివాసులును రాయదుర్గం, బనగానపల్లిలో ఉన్న సుందర్‌రాజును కోడుమూరు మార్కెట్ కమిటీలకు గ్రేడ్-3 సెక్రటరీలుగా పదోన్నతిపై నియమించారు. కాగా.. పత్తికొండ మార్కెట్ కమిటీ సెక్రటరీ కార్నలీస్ పదోన్నతిని తీసుకోలేదు.

తొలగిన ప్ర'జల' కష్టాలు

- నాడు గుక్కెడు నీటికి నరకయాతన
- నేడు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా సమృద్ధిగా ఫిల్టర్ నీరు



నాడు: వెల్దుర్తిలో నీటి కష్టాలు



నేడు: కృష్ణగిరి మోడల్ స్కూల్ వద్ద నిర్మించిన వాటర్ ఫిల్టర్ సంప్



నేడు: ఇంటి వద్ద కుళాయి నుంచి నీటిని పట్టుకుంటున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలో నాలుగేళ్ల క్రితం వరకు నిరంతరం తాగునీటికి కష్టాలే ... తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేఈ క్రిష్ణమూర్తి ప్రాతినిథ్యం వహిస్తున్నా, తాగునీటి సమస్యకు పరిష్కారం చూపలేకపోయారు. 2019 సంవత్సరానికి ముందు వెల్దుర్తికి తాగునీటిని సరఫరా చేసే బ్రహ్మగుండంలోని 18 బోర్లలో 16 బోర్లు చెడిపోయాయి. మిగిలిన రెండు బోర్ల ద్వారా వెల్దుర్తి పట్టణంలో పది, పదిహేను రోజులకు ఒకసారి కుళాయిల్లో నీటిని వదిలేవారు. నిత్యం 3 లక్షల లీటర్ల నీటిని అందించే తుంగభద్ర నీటి పథకాన్ని అప్పట్లో ఎవరు పట్టించుకోలేదు. విద్యుత్ సరఫరా సజావుగా సాగకపోవడం వల్ల తొగర్చేడు స్కీం నుంచి విడుదలవుతున్న నీటిలో తరచు అంతరాయం ఏర్పడుతు వచ్చింది. వేసారి పోయిన వెల్దుర్తి పట్టణ ప్రజలు 2019 ఎన్నికల సమయంలో తాగునీటి సమస్యను పరిష్కరించే వారికే ఓటు వేస్తామని కూడా నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలోనే పత్తికొండ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కంగాటి శ్రీదేవి తాను గెలిచిన వెంటనే వెల్దుర్తి నీటి కష్టాలు తీరుస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు గెలిచిన వెంటనే ఆమె సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి దశాబ్దాల నాటి నీటి సమస్యకు పరిష్కారం చూపారు.

ఇదీ మార్పు

రూ.3.10 కోట్లతో లభించిన పరిష్కారం

వెల్దుర్తిలో నెలకొన్న నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.3.10 కోట్లు వెచ్చించారు. కృష్ణగిరి రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన ఇంటెక్ వెల్ నుంచి 25 హెచ్‌పీ మోటార్ల ద్వారా మోడల్ స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన మైక్రో ఫిల్టర్ల ద్వారా శుద్ధిచేస్తున్నారు. ఈ నీటిని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రెండు సంప్‌ల (2లక్షలు, 4 లక్షల లీటర్ల కేపాసిటీతో) ద్వారా ప్రజల అవసరాలకు అనుగుణంగా రోజుకు 16 లక్షల లీటర్ల ఫిల్టర్ నీటిని అందిస్తున్నారు. ఈ నీటి పథకాన్ని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి 2021 సెప్టెంబర్ 16వ తేదీన ప్రారంభించారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి



మాట్లాడుతున్న వీసీ డీవీఆర్ సాయిగోపాల్

కర్నూలు సిటీ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకుని ఆ దిశగా చదవాలని క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ సాయిగోపాల్, జిల్లా వృత్తి విద్యాధికారి జమీల్ బాషా అన్నారు. కేవీఆర్ బాలికల జూనియర్ కాలేజీ 28వ వార్షికోత్సవాన్ని బుధవారం ఆ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. జూనియర్ కాలేజీ విద్యార్థినులు హాస్టల్ సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారని, తమ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలోనే వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ లాలెప్ప, రిటైర్డ్ ప్రిన్సిపాల్ చెన్నయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



మాట్లాడుతున్న ఏపీ అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ చైర్‌పర్సన్ కళావతి

- ఏపీ అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ చైర్‌పర్సన్, పాలకొండ ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి

నంద్యాల: ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఏపీ అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ చైర్‌పర్సన్, పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ సమావేశాన్ని జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. డీఆర్‌ఓ పుల్లయ్య, ఏపీ లెజిస్లేటివ్ అసెంబ్లీ అసిస్టెంట్ సెక్రటరీ భిక్షం, సెక్షన్ ఆఫీసర్ కాశిరెడ్డి, ఏఎస్‌ఓ ఉమేష్‌చంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఇరిగేషన్, వ్యవసాయం, నీటిపారుదల శాఖలకు సంబంధించిన బడ్జెట్ ఎస్టిమేట్స్ అడిగి తెలుసుకుంటూ క్షేత్రస్థాయిలో తలెత్తే ఆర్థిక ఇబ్బందులపై పరిశీలిస్తామన్నారు. బడ్జెట్ కేటాయింపు, వర్క్ ఆర్డర్ అయిన తర్వాత కాంట్రాక్టర్లు జాప్యం చేయకుండా పనులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అన్ని పనులకు ప్యాకేజ్ కాంట్రాక్ట్‌గా ఇవ్వకుండా విభజించి పనులు కేటాయించాలన్నారు. జల్ జీవన్ మిషన్ కింద పైప్ లైన్ వేసేటపుడు ప్రజల సలహాలు తీసుకొని పనులు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈని ఆదేశించారు. గ్రామాల్లో రాత్రింబవళ్లు వీధి దీపాలు వెలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు అండగా ఉండాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బీడు భూములకు అవసరమైన నీటిని కేటాయించి రైతుల నుంచి వాటర్ ట్యాక్స్ వసూలు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనులు, నెలకొన్న ఇబ్బందులను పంచాయతీ రాజ్ శాఖ ఎస్‌ఈ రామ్మోహన్, ఇరిగేషన్ ఎస్‌ఈ రామచంద్రారెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ చింతామణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్, డీపీఓ మంజులవాణి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు కమిటీ చైర్‌పర్సన్‌కు వివరించారు.

ముగిసిన ప్రపంచ బ్యాంక్ బృందం పర్యటన



ఇంజనీరింగ్ నిపుణులతో సమావేశమైన ప్రపంచ బ్యాంక్ బృందం

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రపంచ బ్యాంక్ బృందం శ్రీశైలం పర్యటన బుధవారం ముగిసింది. మంగళ, బుధవారాల్లో శ్రీశైలం డ్యామ్ పరిసర ప్రాంతాలను పరిశీలించింది. డ్యామ్ సేఫ్టీ అథారిటీ సభ్యులు, సెంట్రల్‌వాటర్ కమిషన్ సభ్యులు ఇచ్చిన నివేదికల ఆధారంగా డ్యామ్‌ను అధ్యయనం చేశారు. బుధవారం వ్యూ పాయింట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంజినీరింగ్ నిపుణులతో ప్రపంచ బ్యాంక్ బృందం సభ్యులు హండ, రవివర్మ సమావేశమయ్యారు. నివేదికల్లో ఏమైనా మార్పులు, చేర్పులు, సవరణలు ఉంటే మూడు వారాలలోగా తుది నివేదికను అందజేయాలని ప్రపంచ బ్యాంక్ బృందం ఇంజినీరింగ్ నిపుణులను ఆదేశించింది. తుది నివేదిక రాగానే ఆర్థిక రుణాన్ని మంజూరు చేసి డ్యామ్ పటిష్టతకు అవసరమైన పనులు చేపట్టేందుకు సన్నద్ధం కావాలని తెలిపింది. సమావేశంలో సీడబ్ల్యూసీ నిపుణులు అతుల్‌యాప, అఖిలేష్‌కుమార్, ఆర్థర్, డ్యామ్ సేఫ్టీ అథారిటీ చీఫ్ ఇంజినీర్ ఈవీఎమ్ఎమ్ రత్నకుమార్, సీఈ ప్రాజెక్ట్స్ బీర్‌బాషా, డ్రిప్ ఇంజినీర్లు ఆస్టిక, విజయానంద్, డ్యామ్ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, ఈఈ మనోహర్‌రాజు పాల్గొన్నారు.

నందవరంలో 'వికసిత్ భారత్'



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ఎస్‌పీ సింగ్ బఘేల్

నందవరం: మండల కేంద్రమైన నందవరంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర రాష్ట్రీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ఎస్‌పీ సింగ్ బఘేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ఈ యాత్రను ప్రారంభించామన్నారు. జనవరి 26 వరకు వికసిత్ యాత్ర కొనసాగుతుందన్నారు. పేదలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 25 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. జన్‌ధన్ బ్యాంకు ఖాతాల ద్వారా పేదలకు డీబీటీ పద్ధతిలో సంక్షేమ పథకాల నగదును జమ చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళలకు ఉచితంగా ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్నామన్నారు. సబ్ కలెక్టర్ నారాయణ శర్మ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట సావిత్రి, ఉప సర్పంచ్ శివారెడ్డిగౌడ్, జెడ్పీ సీఈఓ, నోడల్ ఆఫీసర్ నాసరరెడ్డి, డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య, డీపీఓ నాగరాజు నాయుడు,డీఆర్‌డీఓ పీడీ సలీమ్‌బాషా, జీఆర్పీ ఎస్‌ఈ రెడ్డి శేఖరరెడ్డి, డీఈఓ రంగారెడ్డి, పశుసంవర్ధకశాఖ జెడీ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు అధికారుల సన్నద్ధత

- పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన కోసం నివేదిక కోరిన కలెక్టర్
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల గుర్తింపుపై కసరత్తు
- రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం
- ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారుల నియామకం

కర్నూలు(సెంట్రల్): రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఓటరు జాబితా సవరణ పనులు కొలిక్కి రావడంతో ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించారు. ఈనెల 22న తుది ఓటరు జాబితాను విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించారు. కర్నూలు జిల్లాలో కర్నూలు పార్లమెంట్‌తోపాటు కర్నూలు, పాణ్యం, కోడుమూరు, ఎమ్మిగనూరు,మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 20,08,721 మంది ఓటర్లు ఉన్నారు. ఆయా ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 2,186 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వీటిలో మౌలిక సదుపాయాల కల్పనపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించింది. అన్ని పోలింగ్ కేంద్రాలను గ్రౌండ్ ఫ్లోర్లలోనే ఏర్పాటు చేయాలని, ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు, వాకిళ్లు, కిటికీలు, విద్యుత్, లైట్లు, ఇంటర్నల్ వైరింగ్, పవర్ సప్లై కోసం సాకెట్స్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. నాడు-నేడులో పనులు చేపట్టని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఇటీవల జరిగిన అధికారుల సమావేశంలో ఆదేశించారు. ఒకటి, రెండు రోజుల్లో ఆ వివరాలు వచ్చే అవకాశం ఉంది.

జీపీఎస్‌తో అనుసంధానం,..

ఎన్నికల నిర్వహణ కోసం డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలతోపాటు స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తారు. ఇందులో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తారు. ఇక్కడి నుంచి ఎన్నికల సామగ్రి, నిర్వహణ సిబ్బంది తీసుకొని పోలింగ్ కేంద్రాలను వెళ్తారు. ఇందుకోసం అన్ని నియోజకవర్గాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను గుర్తించేందుకు చర్యలు తీసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లోనే ఏర్పాటు చేయాలని, వాహనాలు, సిబ్బంది వెళ్లడానికి విశాలమైన ప్రదేశాలు అనువుగా ఉండేలా చూసుకోవాలని కేంద్రం ఎన్నికల సంఘం సూచనలతో ఆయా కేంద్రాలను గుర్తించారు. అలాగే ఎన్నికలు ముగిసిన తరువాత ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలను నేరుగా రిసెప్షన్ సెంటర్లకు అత్యంత బందోబస్తు మధ్య తీసుకెళ్లి రిసెప్షన్ సెంటర్లలో అప్పగించాల్సి ఉంటుంది. అక్కడి నుంచి స్ట్రాంగ్ ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్ర పరుస్తారు. ఈ క్రమంలో అన్ని నియోజకవర్గాలకు సంబంధించి రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్‌లను రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేశారు. అన్ని నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలను కూడా రాయలసీమ యూనివర్సిటీలోనే ఏర్పాటు చేశారు.

నోడల్ అధికారుల నియామకం...

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన సమన్వయం చేసేందుకు జిల్లా ఎన్నికల సంఘం నోడల్ అధికారులను నియమించింది. జిల్లా ఉన్నతాధికారులకు పని విభజన చేస్తూ దాదాపు 16 కమిటీలను నియమించారు. ఒక్కో కమిటీకి జిల్లా ఉన్నతాధికారిని నోడల్ ఆఫీసర్‌గానియమించారు.

ఏర్పాట్లన్నీ పూర్తి చేస్తున్నాం

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను నియోజకవర్గక కేంద్రాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసకుంటున్నాం. కౌంటింగ్, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌లను రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్నాం. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులను సమన్వయం చేసేందుకు నోడల్ అధికారులను నియమించాం.

– డాక్టర్ జి.సృజన, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, కర్నూలు